ఉన్నత చదువులు పేదలకు దూరం



ఉన్నత చదువులు చదవాలన్న ఆశ, కోరికలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయంతో పూర్తిగా నీరుగారిపోతుంది. ఇలాంటి నిర్ణయాలతో పేద ప్రజలకు ఇబ్బందులు తప్పవు. కూటమి ప్రభుత్వ ఆలోచన దుర్మార్గం. కేంద్రం ప్రభుత్వంతో చర్చలు జరిపి మరిన్ని మెడికల్ కళాశాలు తీసుకురాక పోగా.. వద్దని లెటర్లు రాయడం శోచనీయం. ముఖ్యంమత్రి చంద్రబాబు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. మెడికల్ కాలేజీలు ప్రారంభిస్తే వందలాది మంది విద్యార్థులు వైద్య విద్య అందుతుంది. ఇదే క్రమంలో నిరుద్యోగులకు వైద్యశాఖలో అన్ని రకాలైన ఉద్యోగ అవకాశాలు లభించి ఉపాధి కలుగుతుంది.

– విశ్వనాథ, అన్నమయ్య జిల్లా సీపీఐఎంఎల్ జిల్లా నాయకులు



చంద్రబాబు పునరాలోచించాలి



కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాలల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పునరాలోచించాలి. పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్య చదవాలంటే ప్రభుత్వ కళాశాలలు చాలా అవసరం. ప్రైవేటు కళాశాలల్లో లక్షలాది రూపాయలు చెల్లించి చదివే స్తోమత లేక చాలా మంది విద్యార్థుల వైద్య విద్యకు దూరం అవుతారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఎంతగానో ఉపయోగపడుతాయి. గత ప్రభుత్వంలో పూర్తయిన మెడికల్ కళాశాలలకు సంబంధించి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీట్లను కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం సమంజసం కాదు.

– ఎం.సూర్యమోహన్‌రెడ్డి, హరినాథవీధి, రాయచోటి

పంట పొలాన్ని దున్నించడం సరికాదు

సిద్దవటం: పెద్దపల్లె పంచాయతీ మందపల్లెలో పసుపు పంటను సిద్దవటం తహసీల్దారు దున్నించడం సరికాదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి రాజేశ్వరిరెడ్డి అన్నారు. 30 ఏళ్లగా డీకేటీ భూముల్లో సాగు చేసుకుంటున్న పంటను తహసీల్దార్ జేసీబీతో దున్నేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉండ్రాళ్లయ్యా.. వెళ్లి రావయ్యా!

గాలివీడు : ఎనిమిది రోజుల పాటు విశేష పూజలందుకున్న విఘ్ననాయకుడు శనివారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వాడవాడలా కొలువుదీరిన గణేష్ విగ్రహాలను గణేష్ నిమజ్జనం చేశారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు

సుండుపల్లె: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మండల వ్యాప్తంగా గణేష్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి శనివారంయ నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లి: వినాయక నిమజ్జనాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. శనివారం లక్కిరెడ్డిపల్లి స్టేట్ బ్యాంక్ వీధి, గొల్లపల్లి, గాండ్లపల్లి, గంగనపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకులను నిమజ్జనం చేశారు.

వైభవంగా నిమజ్జనం

సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామ పంచాయతీ పరిధి లోని శాంతినగర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి శనివారం వైభవంగా నిమజ్జనం కార్యాక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి లడ్డూను కడపకు చెందిన కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నాగేశ్వర్‌బాబు మిత్ర బృందం రూ. 40 వేలకు దక్కించుకున్నారు.

అన్నదానం

రాయచోటి టౌన్ : వినాయక చవితి సందర్భంగా రాయచోటి పట్టణ, రూరల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు. ఈ మంటపాల వద్ద నిత్య అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు భక్తులతో నిత్య భజన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



సంబేపల్లె : లడ్డూ దక్కించుకున్న సుబ్బారెడ్డి సన్మాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

పెనగలూరు: వినాయక స్వామి ఉత్సవాల్లో భాగంగా పెనగలూరు కొత్తపల్లిలో వినాయక స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే పలు గణేష్ మండపాలను కూడా విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి

సంబేపల్లె : వినాయకుడి ఆశీస్సులు అందరిపై ఉండాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం మండల పరిధిలోని గున్నికుంట్ల దండువాండ్లపల్లెలోని వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ నాగభూషన్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేలం పాటలో రూ.71,000కు లడ్డూను దక్కించుకున్న పి.సుబ్బారెడ్డిని శ్రీకాంత్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



గాలివీడు : నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాజంపేట రూరల్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి పథకం అధికారి డి. శశికళ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహరం అందించాలని సూచించారు. మండల పరిధిలోని కొల్లావారిపల్లి, రాచపల్లి, మిట్టమీదపల్లితో పాటు మున్సిపాలిటీ పరిధిలోని బలిజపల్లిలోని సాక్ష్యం అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం సాక్ష్యం 2.0 కేంద్ర బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైనా ఏల్‌ఈడీ టీవీ, ఆర్‌ఓ వాటర్ ఫిల్టర్, న్యూట్రి గార్డెన్‌ను పరిశీలించారు.

నివాళి

పుల్లంపేట: అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పోలి రాఘవరెడ్డి సతీమణి పోలి భారతి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి శనివారం పుల్లంపేట మండలం ,తిరుమలయ్యగారిపల్లిలో భారతి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఆసుపత్రి అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తానని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. సిద్దవటంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రకాష్ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలోని సిద్దవటం పేద రోగులకు వైద్య సేవలందించేందకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్నీ వసతులతో ఆసుపత్రిని నిర్మించారని తెలిపారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం మండల వైఎసార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి రాజేశ్వరిరెడ్డి, జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, శివయ్య, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్‌నూర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, పెద్దపల్లె మాజీ సర్పంచ్ కె.వి. సుబ్బయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాలస్వామి, కె.వి. సుబ్బారెడి పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

లక్కిరెడ్డిపల్లి: రాజీ మార్గమే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లి సివిల్ జెడ్జి షేక్ పైజున్నీషా పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో పరిష్కారం కానీ సివిల్ కేసులు, బ్యాంకర్ల ద్వారా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించని మొండి బకాయిలు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని కోర్టు వర్గాలు తెలిపారు. భూ తగాదాలు, చిన్నచిన్న గొడవలు, ఇంటి స్థలాల సమస్యలు గ్రామంలోనే పరిష్కరించుకోవాలని, పోలీసు స్టేషన్, కోర్టుల చుట్టూ తిరగవద్దని కక్షిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రారెడ్డి, రెడ్డన్న, చెన్నకృష్ణయ్య, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

118 కేసులు పరిష్కారం

సిద్దవటం: సిద్దవటం జూనియర్ సివిల్ జెడ్జి కోర్టు పరిధిలో శనివారం జరిగిన జాతీయ లోక్ ఆదాలత్‌లో 118 కేసులు పరిష్కరించారు. బద్వేల్ అదనపు జూనియర్ సివిల్ జెడ్జి గాయత్రి సిద్దవటం కోర్టుకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆమె ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ ద్వారా సిద్దవటం కోర్టు పరిధిలోని 118 కేసులు పరిష్కరించారని కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.